### గంగమ్మ ఆలయంలో
## ఎమ్మెల్యే పూజలు



హారతి ఇస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 20: నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు సమీపంలో నిర్మించిన గంగమ్మ ఆలయ ప్రారంభోత్సవానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు, వారి కుటుంబీకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు పాలించే హక్కులేదు: ఈటల



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 20: అబద్ధపు ప్రచారంతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు పాలించే హక్కు లేదని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన అనంతరం ప్రజలను ఓట్లు అడగాలని బీజేపీ నాయకుడు, మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎల్లారెడ్డిలో శనివారం నిర్వహించిన బైక్ ర్యాలీ, సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ హామీని కూడా కాంగ్రెస్ అమలు చేయడం లేదన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే కేంద్రం నుంచి నిధులు వస్తాయని, అప్పుడు రాష్ట్రంలోని హామీలను అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి మరోసారి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈసారి కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాదని జోస్యం చెప్పారు. సమావేశంలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి బీబీ పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార తదితరులు పాల్గొన్నారు.

# ‘ఉపాధి’లో ఫీల్డ్ అసిస్టెంట్ల ఇష్టారాజ్యం

- అధికారుల పర్యవేక్షణ కరువు
- పీడీ హెచ్చరించినా మారని తీరు
- నష్టపోతున్న కూలీలు



బేగంపూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 20: గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారుతున్నది. అధికారుల నిర్లక్ష్యంతో కూలీలకు గిట్టుబాటు కూలి డబ్బులు రావడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్ల(ఎఫ్‌ఏల) నిర్లక్ష్యంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని కూలీలు ఆరోపిస్తున్నారు. పనులకు రాని వారికి కూడా ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరు వేస్తున్నారని, దీంతో పనిచేసిన వారికి తక్కువ డబ్బులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనుల్లోకి రానివారికి హాజరు వేసేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు వారి నుంచి కొన్ని డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు పని కల్పించాలని కొన్ని గ్రామాల్లో కూలీలు డిమాండ్ పత్రాలను అందజేసినా.. పని కల్పించడం లేదని ఆవేదన చెందుతున్నారు.

**పీడీ హెచ్చరించినా..**

గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతున్నది. వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పని చేస్తున్న ప్రదేశానికి రాకుండా, ఇంటి వద్దనే ఉంటూ కూలీల హాజరు వేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. పంట భూముల్లో ఉపాధి హామీ కూలీలతో పని చేయించి రాళ్ల తొలగింపు, భూమి చదును వంటి పనులు చేయించాలనుకునే యజమాని నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు కొంత డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఈజీఎస్ పీడీ చందర్‌నాయక్ సమావేశం నిర్వహించారు. ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచాలని లేదంటే ఎఫ్‌ఏలపై వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పని చేయని కూలీలకు సైతం మస్టర్లలో హాజరు వేస్తున్నారని పనిచేస్తున్న కూలీలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కూలీలు కోరుతున్నారు.

## ఎల్లారెడ్డికి చేరుకున్న ఈవీఎంలు



స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేసిన అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 20: త్వరలో నిర్వహించనున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు శుక్రవారం రాత్రి ఎల్లారెడ్డికి చేరుకున్నాయి. గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఈవీఎంలను ఎల్లారెడ్డికి తీసుకువచ్చారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ శనివారం తెలిపారు. ఎల్లారెడ్డికి వచ్చిన ఈవీఎంలను ఆయా రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి డోర్‌కు సీల్ వేశామని చెప్పారు. ఈవీఎంలను పోలింగ్ కోసం తరలించే వరకు స్ట్రాంగ్ రూం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయనతోపాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, స్థానిక తహసీల్దార్ అల్లం మహేందర్, పలు పార్టీల నాయకులు ఉన్నారు.

## కొలతల ప్రకారం పనులు చేపట్టాలి



పెద్దగుజ్జుల్ తండాలో కొలతలు పరిశీలిస్తున్న ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి

గాంధారి, ఏప్రిల్ 20: కొలతల ప్రకారం ఉపాధి పనులు చేపట్టాలని ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద గుజ్జుల్ తండాలో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. పనులను కొలతల ప్రకారం చేపట్టాలని సూచించారు. కూలీలకు తాగునీటి వసతి కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. పనులకు పెద్ద సంఖ్యలో కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు.

### పంచాయతీ కార్యదర్శులు
## ప్రజలకు అందుబాటులో ఉండాలి



సిద్ధరామేశ్వరనగర్ ప్రైమరీ స్కూల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

భిక్కనూరు, ఏప్రిల్ 20 : గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని ర్యాగట్లపల్లి, గుర్జకుంట, సిద్ధరామేశ్వరనగర్, బస్వాపూర్ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీలు, ప్రభుత్వ పాఠశాలలు, పారిశుద్ధ్య నిర్వహణ, ఉపాధి హామీ, వాటర్ ట్యాంకుల క్లోరినేషన్, క్లీనింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి తాగునీటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని, జాబ్ కార్డు ఉన్న వారికి పని కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## రూ. లక్ష నగదు స్వాధీనం



నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

బాన్సువాడ, ఏప్రిల్ 20 : బాన్సువాడ డివిజన్ కేంద్రంలో ఎన్నికల కోడ్ ఉన్నందున పట్టణ పోలీసులు శనివారం వాహనాలను తనిఖీ చేశారు. నస్రుల్లాబాద్ మండలంలోని నెమ్లి గ్రామానికి చెందిన తౌటి సాయికుమార్ వద్ద డబ్బులను బ్యాంకు నుంచి తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. తాను వద్ద డబ్బులను పెండ్లి ఉందని తీసుకెళ్తున్నానని సాయికుమార్ తెలిపారు. సంబంధిత పత్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో చూపాలని పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ఉన్నందున రూ.50 వేలకు మించి డబ్బులను తీసుకెళ్లొద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్సై జగన్నాథం, సిబ్బంది హరిచంద్, శంకర్ తదితరులు ఉన్నారు.

## రైలు కిందపడి మహిళ మృతి
### కదులుతున్న ట్రైన్ ఎక్కే క్రమంలో ప్రమాదం

వినాయక్‌నగర్, ఏప్రిల్ 20 : ప్లాట్‌ఫాంపై నుంచి కదులుతున్న రైలు ఎక్కే క్రమంలో కాలు జారి రైలు కింద పడి శనివారం ఓ మహిళ మృతిచెందింది. నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగిన ఘటన వివరాలను ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. కామారెడ్డికి చెందిన పసూల రేవతి(39) నిజామాబాద్‌లోని తమ బంధువుల అంత్యక్రియల కోసం శుక్రవారం వచ్చింది. శనివారం ఉదయం 6 గంటలకు కామారెడ్డి వెళ్లేందుకు నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లోని మూడో నంబర్ ప్లాట్‌ఫాంపై కదులుతున్న రైలు ఎక్కేందుకు ప్రయత్నించింది. ప్రమాదవశాత్తు ట్రైన్ కింద పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### జంగంపల్లి బస్‌షెల్టర్‌లో ఒకరి మృతి

భిక్కనూరు, ఏప్రిల్ 20: మండలంలోని జంగంపల్లి గ్రామంలో బస్ షెల్టర్‌లో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట మండలం ఎల్లారం గ్రామానికి చెందిన రుద్రబోయిన సాయిలు (44) కామారెడ్డిలో నివాసం ఉంటున్నాడు. సాయిలు భార్య స్వప్న నాలుగేండ్ల క్రితం మృతి చెందగా.. అప్పటి నుంచి మేస్త్రీ పనిచేసుకుంటూ బతుకుతున్నాడు. 15 రోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళ్లి.. శనివారం జంగంపల్లి బస్ షెల్టర్‌లో శవమై కనిపించాడు. ఫిట్స్ రావడం, ఎండదెబ్బ తగిలి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తమ్ముడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



సోమార్‌పేటలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ అపర్ణ



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

మాచారెడ్డి, ఏప్రిల్ 20 : అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని, రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. మాచారెడ్డి మండలంలోని సోమార్‌పేట గ్రామంలో అకాల వర్షాలకు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోవడం, దెబ్బతిన్న పంట పొలాలను ఆయన శనివారం పరిశీలించారు. ప్రతి ఒక్క రైతును ఆదుకొని పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, మండలాధ్యక్షుడు నౌసిలాల్, బాల్‌రాజ్‌గౌడ్, గణేశ్‌నాయక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**దెబ్బతిన్న పంటల పరిశీలన**

మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట, సోమార్‌పేట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రైతులు పంటను నష్టపోయారు. విషయం తెలుసుకున్న కామరెడ్డి ఏడీఏ అపర్ణ శనివారం క్షేత్రస్థాయి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎల్లంపేట, సోమార్‌పేట క్లస్టర్లలో 120 ఎకరాల వరకు పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయశాఖ అధికారిణి రమ్యశ్రీ, ఏఈవోలు సౌజన్య, శివ చైతన్య ఉన్నారు.

## హోరాహోరీగా కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 20 : మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శనివారం కుస్తీపోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో తలపడేందుకు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి మల్లయోధులు తరలివచ్చారు. ఈ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. పోటీలను తిలకించేందుకు హన్మాజీపేట్, సంగోజీపేట్, కాద్లాపూర్, సోమ్లానాయక్ తండా, పులిగుండతండా, గోపాల్ తండా, వెంకటాపూర్ తండాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామపెద్దలు బోనాల సుభాష్, సంగ్రాం నాయక్, సుధాకర్‌రెడ్డి, సాయిలు, సామేందర్, అక్బర్, సంజీవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

## మద్యం పట్టివేత

డోంగ్లీ, ఏప్రిల్ 20: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన ఒకరు బైక్‌పై దేశీదారును తరలిస్తుండగా పట్టుకున్నారు. అతడి నుంచి 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. డోంగ్లీలోని ఓ హోటల్‌లో 1.350లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ అధికారులు శనివారం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామని చెప్పారు. మద్యం అక్రమంగా సరఫరా చేస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగిస్తున్న ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్

ఎల్లారెడ్డి రూరల్/మాచారెడ్డి, ఏప్రిల్ 20: బాధితులు పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను రికవరీ చేసి అప్పగించామని ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ శనివారం తెలిపారు. రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయికి చెందిన పురం నర్సింహులు, ఎల్లారెడ్డి మండలం అడ్విలింగాల్ గ్రామానికి చెందిన బోరంచ భాస్కర్ సెల్‌ఫోన్లను ఎల్లారెడ్డిలో పోగొట్టుకున్నారు. బాధితులు పూర్తి వివరాలతో ఎల్లారెడ్డి పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని రికవరీ చేసి బాధితులకు శనివారం అందజేశామని ఎస్సై తెలిపారు. మాచారెడ్డి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఆ ఫోన్లను ట్రేస్ చేసి బాధితులకు శనివారం పోలీస్ స్టేషన్‌లో అందజేశారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్టయితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

### గురుకుల ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థులు

రాజంపేట్, ఏప్రిల్ 20 : గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్ష 2024 ఫలితాల్లో రాజంపేట మండలంలోని ఆరేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఆరేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదుతువున్న విద్యార్థులు చెవుల సెస్మిత్ ఉప్పల్‌వాయి (బాలుర), మోతె అక్షిత్‌రెడ్డి ఎర్రాపహాడ్ (బాలుర), అంకం రిశ్విత జంగంపల్లి (బాలికల) గురుకుల పాఠశాలల్లో సీటు సాధించారు. పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు పరీక్ష రాయగా ముగ్గురు ఎంపిక కావడం గర్వంగా ఉందని పాఠశాల విద్యా కమిటీ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు

### నేడు విద్యార్థి పరిచయ సమావేశం

కామారెడ్డి, ఏప్రిల్ 20 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఈ నెల 21వ తేదీన (ఆదివారం) ఉదయం 11 గంటలకు పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల అభ్యాసన సహాయ కేంద్రం కోఆర్డినేటర్ రాజ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ కార్యకలాపాల నిర్వహణ, తరగతులు, పరీక్షలు, ప్రాక్టికల్స్ నిర్వహణ విధి విధానాలు, మోడల్ పేపర్ల గురించి వివరిస్తామని పేర్కొన్నారు. యూనివర్సిటీ వెబ్, రేడియోతోపాటు వివిధ మాధ్యమాల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న సేవల గురించి తెలియజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

### డీఆర్డీవో మురళీకృష్ణ

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 20: ప్రభుత్వం అందజేస్తున్న వడ్డీలేని రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. ఆర్థికాభివృద్ధి సాధించాలని, వ్యాపారాలను వృద్ధి చేసుకోవాలని సూచించారు. నాగిరెడ్డిపేటలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, సంస్థాగత నిర్మాణం, స్త్రీనిధి, అమ్మ ఆదర్శ పాఠశాల, చేపల పెంపకం, రైతు సేవా కేంద్రం తదితర అంశాలను వివరించారు. సమావేశంలో ఎంపీడీవో పర్బన్న, బ్యాంకు లింకేజీ డీపీఎం రవీందర్‌రావు, డీఏపీఎం వకుళ, మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, సీసీలు దత్తు, నారాయణ, రమేశ్, సాయిలు, సుజాత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో మురళీకృష్ణ

## నర్సరీలో షేడ్ నెట్ ఏర్పాటు



ఇలేగావ్‌లోని నర్సరీలో ఏర్పాటుచేసిన షేడ్ నెట్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

డోంగ్లీ, ఏప్రిల్ 20: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన నర్సరీల్లో మొక్కలపై గ్రీన్ మ్యాట్లు ఏర్పాటు చేయలేదు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో మొక్కలు ఎండిపోతున్నాయి. ఈ విషయాన్ని నమస్తే తెలంగాణ దినపత్రికలో ‘నిర్వహణపై నిర్లక్ష్యం’ అనే కథకం 19వ తేదీన ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. ఇలేగావ్‌లో నర్సరీలో గ్రీన్ షేడ్ నెట్‌ను ఏర్పాటు చేయించారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవాటిని నాటారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

## ఉప్పొంగిన ‘భగీరథ’

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కొట్టాల్ గ్రామం వద్ద మిషన్ భగీరథ పైపునకు శనివారం లీకేజీ ఏర్పడింది. దీంతో గ్రామ సమీపంలోని కామారెడ్డి ప్రధాన రహదారిపై గంటసేపు నీరు వృథాగా పోయింది. లీకేజీ ఉధృతికి నీరు ఫౌంటేన్‌లా చిమ్మడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతులు చేపట్టడంతో సమస్య పరిష్కారమైంది.



లీకవుతున్న నీరు